భారత టీటీ జట్టుకు కాంస్యం

కజన్: రష్యా లోని కజన్ నగరం వేదికగా జరుగుతున్న బ్రిక్స్ గేమ్స్‌లో భారత మహిళల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు కాంస్యం గెలుచుకుని పతకాల పట్టికలో బోణీ కొట్టింది. టీటీ టీమ్ ఈవెంట్‌లో శనివారం జరిగిన సెమీఫైనల్స్‌లో భారత్.. 1-3తో చైనా చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో యషిని గెలిచినా ఆ తర్వాత బౌస్య, మౌమితా చేతులెత్తేయడంతో భారత్ కాంస్యానికి పరిమితమైంది. కాంస్యం సాధించిన భారత జట్టుకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ అభినందనలు తెలిపారు. కాగా ఇవే క్రీడల్లో భారత పురుషుల జట్టు ఐదో స్థానంలో నిలిచింది.

జర్మనీ శుభారంభం

యూరో కప్ 2024

మునిచ్: స్వదేశంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక యూరో కప్‌లో జర్మనీ శుభారంభం చేసింది. ఈ మెగా టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో జర్మనీ.. 5-1తో స్కాట్లాండ్‌పై భారీ విజయం సాధించింది. ఆట మొదలైన 4వ నిమిషంలోనే జర్మనీ ఆటగాడు ఫ్లోరియన్ రిట్జ్ గోల్ కొట్టగా 19వ నిమిషంలో కెప్టెన్ ఇకాయ్ గుండోగన్ రెండో గోల్ చేశాడు. కై హవెర్ట్జ్ (45వ నిమిషంలో), నికోలస్ ఫుల్‌క్రగ్ (68వ నిమిషంలో) తలా ఓ గోల్ చేసి జర్మనీకి తిరుగులేని ఆధిక్యాన్నిచ్చారు. స్కాట్లాండ్ తరపున 87వ నిమిషంలో అంటోనియో రుడిగర్ గోల్ చేసి జర్మనీ ఆధిక్యాన్ని కాస్త తగ్గించినా 93వ నిమిషయంలో ఎమ్ర్ కెన్ మరో గోల్‌తో జర్మనీ భారీ విజయాన్ని నమోదుచేసింది. ఇదే గ్రూప్‌లో స్విట్జర్లాండ్.. 3-1తో హంగేరిని చిత్తుచేసింది. గ్రూప్-బీలో స్పెయిన్ 3-0తో క్రొయేషియాను ఓడించింది.

రష్యా, బెలారస్ అథ్లెట్లకు ఊరట

తటస్థ హోదాతో పలువురు ఆటగాళ్లకు అనుమతి

లుసానె: రష్యా, బెలారస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) శుభవార్త చెప్పింది. వచ్చే నెల నుంచి పారిస్ వేదికగా జరగాల్సి ఉన్న ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు గాను పై రెండు దేశాలకు చెందిన పలువురు ఆటగాళ్లకు 'తటస్థ హోదా'ను అందించింది. రష్యా నుంచి 14 మంది, బెలారస్ నుంచి 11 మంది అథ్లెట్లు తమ దేశాల జాతీయ జెండా, గీతం, రంగులు లేకుండా తటస్థ హోదాలో ఈ క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించింది. సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, తైక్వాండో, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్ విభాగాల్లో బరిలోకి దిగబోయే ఆటగాళ్ల పేర్లను విడుదల చేసింది.. బృందాలుగా (టీమ్ ఈవెంట్స్) ఆడే క్రీడల నుంచి రష్యా, బెలారస్ ఆటగాళ్లపై నిషేధం కొనసాగుతోంది. రెండేండ్లుగా ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా ఈ రెండు దేశాలపై ఐవోసీ నిషేధం విధించిన విషయం తెలిసిందే.

మాజీ ఫుట్‌బాలర్ కన్నుమూత

లండన్: ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) లో అర్సెనల్ ఫ్రాంచైజీకి ఆడిన ప్రముఖ ఫుట్‌బాలర్ కెవిన్ క్యాంప్‌బెల్ (54) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం మరణించినట్టు అర్సెనల్ ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడిస్తూ మాజీ ఆటగాడికి సంతాపం ప్రకటించింది. 18 ఏండ్ల వయసులోనే 1985లో అర్సెనల్ తరపున అరంగేట్రం చేసిన క్యాంప్‌బెల్ స్ట్రైకర్‌గా గుర్తింపు పొందారు. అర్సెనల్‌తో పాటు ఎవర్టన్, నాటింగ్‌హామ్ క్లబ్‌లకూ ప్రాతినిధ్యం వహించి 542 మ్యాచ్‌లలో 148 గోల్స్ సాధించారు.

పురుషులదీ అదే బాట

అంటల్య : టర్కీలోని అంటల్య వేదికగా జరుగుతున్న 'ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్'లో భారత పురుషుల రికర్వ్ జట్టు సైతం మహిళల బాటే నడిచింది. శనివారం జరిగిన ఈవెంట్‌లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన భారత్.. 4-5తో మెక్సికో చేతిలో అపజయం పాలైంది. తొలి రెండు సెట్లను అలవోకగా గెలుచుకున్న భారత షూటర్లు తర్వాత తడబడి మూల్యం చెల్లించుకున్నారు. శుక్రవారం ఇదే టోర్నీలో మహిళల రికర్వ్ జట్టు ఉక్రెయిన్ చేతిలో ఓడిన విషయం తెలిసిందే. ఇక పారిస్ ఒలింపిక్స్‌లో టీమ్ కోటా దక్కాలంటే భారత్‌కు ఉన్న ఆఖరి అవకాశం ఈనెల 24న వెల్లడించే ర్యాంకుల తర్వాతే తేలనుంది.

నేటి నుంచే భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్

బెంగళూరు: స్వదేశంలో భారత మహిళల క్రికెట్ జట్టు ఆదివారం నుంచి దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా హర్మన్‌ప్రీత్ కౌర్ సేన పటిష్టమైన సౌతాఫ్రికాతో ఢీకొననుంది. సౌతాఫ్రికాతో మూడు వన్డేలకూ చిన్నస్వామి స్టేడియమే ఆతిథ్యమిస్తోంది.

ఆఖరి పోరూ ఆవిరే

- భారత్-కెనడా మ్యాచ్ వర్షార్పణం
- టాస్ పడకుండానే రద్దు

ఫ్లోరిడా: టీ20 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత క్రికెట్ జట్టు గ్రూప్ దశలో ఆఖరి మ్యాచ్‌ను విజయంతో ముగించాలని చూసినా రోహిత్ సేనకు నిరాశే ఎదురైంది. టీమ్‌ఇండియా ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. శనివారం ఫ్లోరిడాలోని లాడర్‌హిల్ వేదికగా కెనడాతో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా టాస్ కూడా పడకుండానే రద్దైంది. గత వారం రోజులుగా ఇక్కడ కురుస్తున్న వర్షంతో శ్రీలంక-నేపాల్, అమెరికా-ఐర్లాండ్ మ్యాచ్ లూ టాస్ పడకుండానే రద్దు కాగా శనివారమూ అదే సీన్ పునరావృతమైంది. పలుమార్లు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు.. ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఇరు జట్లకూ తలా ఓ పాయింట్ దక్కింది. దీంతో మూడు మ్యాచ్‌లలో గెలిచిన భారత్ ఏడు పాయింట్లతో గ్రూప్-ఏ నుంచి అగ్రస్థానం దక్కించుకుని సూపర్-8 పోరుకు సిద్ధమైంది. ఇదే గ్రూపు నుంచి అమెరికా 5 పాయింట్లతో రెండో జట్టుగా తదుపరి దశకు ముందంజ వేసింది.

సూపర్-8లో ఎవరితో!

గ్రూప్ దశ పోటీలు ముగింపు దశకు చేరడంతో ఈనెల 20 నుంచి సూపర్ -8 మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. ఈ దశలో 8 జట్లూ రెండు గ్రూపులుగా విడిపోయి ఆ గ్రూపులో ఉన్న మిగిలిన మూడు జట్లతో తలపడతాయి. ఈ క్రమంలో సూపర్ -8లో రోహిత్ సేన.. జూన్ 20న అఫ్గానిస్థాన్ (అంటిగ్వా)తో మొదటి మ్యాచ్ ఆడనుంది. 22న గ్రూప్ డీ లో రెండో స్థానంలో నిలిచే జట్టు (బంగ్లాదేశ్ లేదా నెదర్లాండ్స్)తో తలపడాల్సి ఉంటుంది. 24న ఆస్ట్రేలియాతో తాడో పేడో తేల్చుకోనుంది.

ఇదేం షెడ్యూల్?

ఫ్లోరిడాలో వరుసగా మూడో మ్యాచ్ టాస్ పడకుండానే రద్దవడంతో అంత జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)పై క్రీడా విశ్లేషకులతో పాటు అభిమానులూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత్-కెనడా మ్యాచ్ రద్దయ్యాక మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, సంజయ్ మంజ్రేకర్ ఐసీసీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ వర్షాలు వచ్చే సూచన ఉంటే స్టేడియాలు పూర్తిగా కప్పిఉంచేలా ఏర్పాట్లు చేయాలని వాళ్లు అభిప్రాయపడ్డారు. షెడ్యూల్ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సోషల్ మీడియా వేదికగా క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. ఈ టోర్నీకి ఆతిథ్యదేశంగా ఉన్న వెస్టిండీస్‌లోనూ వర్షాల కారణంగా పలు మ్యాచ్‌లకు అంతరాయం కలిగింది. శనివారం నమీబియా-ఇంగ్లండ్ మధ్య అంటిగ్వా వేదికగా జరగాల్సిన మ్యాచ్‌లోనూ వరుణుడు అడ్డుకోవడంతో డిఫెండింగ్ చాంపియన్ ఈ టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది.

కివీస్‌కు ఓదార్పు విజయం

తరౌబా: తొలిసారి టీ20 వరల్డ్ కప్ సూపర్-8 చేరకుండానే నిష్క్రమించిన న్యూజిలాండ్‌కు ఓదార్పు విజయం దక్కింది. గ్రూప్ 'సీ' లో తరౌబా వేదికగా ఉగాండాతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉగాండా.. న్యూజిలాండ్ బౌలర్లు టిమ్ సౌథీ (3/4), బౌల్ట్ (2/7) శాంట్నర్ (2/8) ధాటికి 18.4 ఓవర్లలో 40 పరుగులకే చాప చుట్టేసింది. కెన్నెత్ (11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. ఛేదనను కివీస్.. 5.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. సౌథీకే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. మ్యాచ్ ముగిశాక కివీస్ దిగ్గజ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ ఇదే తన చివరి ప్రపంచకప్ అని చెప్పడం గమనార్హం.

సఫారీలను భయపెట్టిన నేపాల్

ఒక్క పరుగు తేడాతో గెలిచిన దక్షిణాఫ్రికా
రాణించిన షంసీ • అసిఫ్ పోరాటం వృథా

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): సంచలనాలకు వేదికవుతున్న టీ20 వరల్డ్ కప్‌లో మరో అగ్రశ్రేణి జట్టు దక్షిణాఫ్రికాను 'పసికూన' నేపాల్ భయపెట్టింది. ఆఖరి బంతికి ఒకే ఒక్క పరుగు తేడాతో ఆ జట్టు ఓటమి పాలవడంతో ఈ టోర్నీలో మరో సంచలనం వెంట్రుకవాసిలో తప్పింది. గ్రూప్-డి లో భాగంగా సెయింట్ విన్సెంట్ వేదికగా దక్షిణాఫ్రికా-నేపాల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రొటీస్ టీమ్ ఒక్క పరుగు తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన సఫారీలు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 115 పరుగులకే పరిమితమయ్యారు. ఆ జట్టులో రీజా హెండ్రిక్స్ (43) రాణించగా ట్రిస్టన్ స్టబ్స్ (27) ఫర్వాలేదనిపించాడు. నేపాల్ బౌలర్లలో కుశాల్ బుర్టెల్ (4/19), దీపేంద్ర (3/21) దక్షిణాఫ్రికాను కట్టడిచేశారు. అనంతరం లక్ష్య ఛేదనలో నేపాల్.. 20 ఓవర్లలో 114/7 పరుగుల వద్ద ఆగిపోయింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' షంసీ (4/19) సౌతాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించాడు.

స్వల్ప ఛేదనను నేపాల్ ధాటిగానే ఆరంభించింది. ఓపెనర్ అసిఫ్ షేక్ (42) దూకుడుగా ఆడాడు. కానీ సఫారీ స్పిన్నర్ తబ్రేజ్ షంసీ ఒకే ఓవర్లో ఓపెనర్లు కుశాల్ (13), అసిఫ్‌ను ఔట్ చేసి ఆ జట్టును దెబ్బకొట్టాడు. అనిల్ (27) పోరాడటంతో నేపాల్ విజయానికి ఆఖరి ఓవర్లో 8 పరుగులు చేయాల్సి వచ్చింది. చివరి ఓవర్ వేసిన బార్ట్‌మన్.. 4 బంతుల్లో 6 పరుగు లిచ్చినా ఐదో బంతికి పరుగులేమీ రాలేదు. ఆఖరి బంతికి పరుగు తీయబోయిన గుల్షన్ ఝా (6) రనౌట్ అవడంతో నేపాల్ ఆశలు ఆవిరవ్వగా దక్షిణాఫ్రికా ఊపిరి పీల్చుకుంది.

5 టీ20లలో ఒక్క పరుగు తేడాతో గెలవడం దక్షిణాఫ్రికాకు ఇది ఐదోసారి టీ20 ప్రపంచకప్‌లలో రెండోసారి.

సంక్షిప్త స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 115/7 (హెండ్రిక్స్ 43, స్టబ్స్ 27, కుశాల్ 4/19, దీపేంద్ర 3/21) **నేపాల్:** 20 ఓవర్లలో 114/7 (అసిఫ్ 42, అనిల్ 27, షంసీ 4/19, మార్క్‌రమ్ 1/8)

చిత్రం

గరం.. గరం యాక్షన్

నాని కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 29న ప్రేక్షకుల ముందుకురానుంది. యాక్షన్ అడ్వెంచర్ మూవీగా తెరకెక్కిస్తున్నారు. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా 'గరం గరం..' అంటూ సాగే తొలి లిరికల్ వీడియోను విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ సంగీతాన్నందించిన ఈ పాటను విశాల్ దల్జానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ పాత్రుడు రచించారు. నాని పాత్రలోని ఇంటెన్సిటీని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. కోపాన్ని క్రమపద్ధతిలో వాడుకుంటూ ప్రత్యర్థులను అంతమొందించే సూర్య పాత్రలో నాని అభినయం హైలైట్‌గా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జే.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.

ఎన్టీఆర్ 'డ్రాగన్'లో విలన్‌గా బాలీవుడ్ హీరో?

ఓ వైపు 'దేవర'.. ఇంకో వైపు 'వార్'.. తీరిక లేకుండా షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు తారక్. ఇంకోవైపు ప్రశాంత్‌నీల్ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా చకచకా జరుగుతూవుంది. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ అనుకుంటున్నారట ప్రశాంత్‌నీల్. కథానాయికగా రష్మిక మందన్నా దాదాపు ఖరారైనట్టు విశ్వసనీయ సమాచారం. ఇదే నిజమైతే తారక్‌తో రష్మిక నటించే తొలి సినిమా ఇదే అవుతుంది. ఇందులో విలన్ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందట. దానికోసం బాలీవుడ్ నటుడు బాబీడియోల్‌ని కూడా కలిశారట ప్రశాంత్‌నీల్. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ 'సలార్ - శౌర్యాంగ పర్వం' షూటింగ్‌ను మొదలుపెట్టే పనిలో ఉన్నారు. ఎన్టీఆర్ దేవర, వార్ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ప్రాజెక్టులు కంప్లీట్ అవ్వగానే తారక్-ప్రశాంత్‌నీల్‌ల ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని తెలుస్తున్నది. ప్రస్తుతమైతే ఈ సినిమా ప్రీపొడక్షన్ వర్క్ చకచకా జరుగుతున్నదని విశ్వసనీయ సమాచారం. తారక్ కెరీర్‌లోనే మెమరబుల్ మాస్ మూవీగా ఈ సినిమాను తెరకెక్కిస్తానని ప్రశాంత్‌నీల్ నమ్మకంగా చెబుతున్నారు.

కొంచెం టెన్షన్‌గా ఉంది

దీపికా పదుకొనే ప్రస్తుతం పూర్తి విశ్రాంతిలో ఉంది. ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించడానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ ఓ కొత్త జీవితాన్ని గడుపుతున్నది. ఇటీవల ఆన్‌లైన్‌లో తన అభిమానులతో ఇంటరాక్ట్ అయిన దీపిక.. తన ప్రెగ్నెన్సీ లైఫ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'ఇన్నాళ్లూ బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకునేదాన్ని. ఇష్టమైన ఫుడ్‌ని కూడా అవైడ్ చేసేదాన్ని. ఇప్పుడు కోరింది తింటున్నాను. నేనెంత తింటే నా బేబీకి అంత మంచిదని డాక్టర్ చెప్పారు. అయితే బయటి ఫుడ్ మాత్రం తినడంలేదు. చక్కగా ఇంట్లో చేసుకునే తింటున్నా. బోర్ కొడితే బయట కెళ్తున్నాను. అయితే పక్కన రణ్‌వీర్ ఉండాల్సిందే. మా అమ్మానాన్న వచ్చి వెళ్తున్నారు. మొన్నామధ్య రణ్‌వీర్ పేరెంట్స్ కూడా రెండ్రోజులుండి వెళ్లారు. కుటుంబసభ్యులతో గడపడం ఆనందంగా ఉంది. నేను ఏ మాత్రం ఆందోళన చెందకుండా రణ్‌వీర్ దగ్గరుండి చూసుకుంటున్నాడు. డెలివరీ సెప్టెంబర్‌లో ఉంటుందని డాక్టర్ చెప్పారు. కొంచెం టెన్షన్‌గా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది దీపికా పదుకొనే.

డబుల్ ఇస్మార్ట్ వచ్చేస్తున్నాడు

'ఇస్మార్ట్ శంకర్'గా బాక్సాఫీస్ వద్ద రామ్, పూరీజగన్నాథ్ చేసిన సందడి అంతాఇంతాకాదు. యువతరాన్ని విశేషంగా అలరించిందా సినిమా. ఆ సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్'కి పూరీజగన్నాథ్ శ్రీకారం చుట్టగానే, సినిమాపై అంచనాలు ఆటోమేటిగ్గా ఆకాశాన్నితాకాయి. ఈ సినిమా తాజా అప్‌డేట్స్ కోసం యూత్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు దర్శకుడు పూరీ జగన్నాథ్. ఆగస్ట్ 15న స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా థియేటర్లలో 'డబుల్ ఇస్మార్ట్'ను విడుదల చేయనున్నట్టు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్ట్ 15 గురువారం రావడంచేత లాంగ్ వీకెండ్ ఈ సినిమాకు కలిసొస్తుందని, అంతేకాక, సోమవారం 'రక్షాబంధన్' మరో హాలిడే కూడా ఈ సినిమాకు కలిసి రావడంతో ఆగస్ట్ 15వ తేదీ రిలీజ్‌కు పర్‌ఫెక్ట్ అని భావించామని పూరీ తెలిపారు. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ పరంగా ప్రీక్వెల్ కంటే, డబుల్ మ్యాడ్‌నెస్ ఈ 'డబుల్ ఇస్మార్ట్'లో ఉంటుందని పూరీ అన్నారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రామ్ పవర్‌పుల్‌గా కనిపిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు కెమెరా: సామ్ కె.నాయుడు, జియాని జియానెలి, సంగీతం: మణిశర్మ, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.

ఒలింపిక్ ప్రమోషన్‌లో 'గీత గోవిందం' పాట

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'గీత గోవిందం' చిత్రం ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను మెప్పించింది. గోపీసుందర్ స్వరపరచిన గీతాలు మెలోడీ ప్రధానంగా సంగీత ప్రియుల్ని అలరించాయి. ఈ సినిమాలోని 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..' గీతం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఒలింపిక్స్ కమిటీ అధికారిక పేజీలో ఈ పాటను నేపథ్యంగా తీసుకొని ఓ వీడియోను రూపొందించడం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. జూలై 26 నుంచి పారిస్ వేదికగా ప్రపంచ క్రీడా సంరంభం ఒలింపిక్స్ మొదలుకానుంది. ఈ నేపథ్యంలో ఒలింపిక్ కమిటీ సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నది. తాజాగా ఒలింపిక్ కమిటీ తన అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేసిన వీడియోలో ఈఫిల్ టవర్‌తో పాటు పారిస్ అందాలను ఆవిష్కరిస్తూ ఓ వీడియోను విడుదల చేసింది. దీనికి బ్యాక్‌గ్రౌండ్‌లో 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..' ట్యూన్‌ను జత చేసింది. ఈ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన విజయ్ దేవరకొండ 'కొన్ని పాటలు ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతాయి' అనే క్యాప్షన్‌తో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి, రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రాల్లో నటిస్తున్నారు.

గోదావరి నేపథ్య ప్రేమకథ

సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విష్ణుష్ దర్శకుడు. పీఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. శనివారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌తో పాటు సంస్థ బ్యానర్ లోగోను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. గోదావరి నేపథ్యంలో అందంగా తీర్చిదిద్దిగా ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన హృద్యమైన ప్రేమకథా చిత్రమిదని, ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ, రచన-దర్శకత్వం: పీఎల్ విష్ణుష్.

భయపెట్టే 'రా రాజా'

సుగి విజయ్, మౌనిక మగులూరి జంటగా నటించిన చిత్రం 'రా రాజా'. బి.శివప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమా టీజర్‌ని హీరో అల్లరి నరేశ్ చేతులమీదుగా లాంచ్ చేశారు. '24 కేరక్టర్స్ ఇందులో ఉన్నట్టు తెలిసింది. నిమిషంన్నర నిడివి గల ఈ టీజర్‌లో ఒక్క కేరక్టర్‌ని చూపించలేదు. ఒక్క డైలాగ్ లేదు. కేవలం హారర్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో టెర్రిఫిక్‌గా టీజర్‌ని కట్ చేసిన దర్శకుడికి నా అభినందనలు. టీజర్‌లో విజువల్స్, నేపథ్యసంగీతం అద్భుతంగా వున్నాయి. కచ్చితంగా ట్రెండ్ సెట్ చేసే సినిమా అవుతుంది' అని అల్లరి నరేశ్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ్, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: శ్రీపద్మిని సినిమాస్.

ఏమవునో ఏమవునో.. ఈ జంట ఏమవునో..

రాజ్‌తరుణ్ తాజా సినిమా 'భలే ఉన్నాడే'. మనీషా కంద్కూర్ కథానాయిక. జె.శివసాయివర్ధన్ దర్శకుడు. ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు సంబంధించిన సెకండ్ సింగిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'ఏమవునో ఏమవునో.. ఈ జంట ఏమవునో.. ఎందాక సాగేనో ఈ పయనం తెలుసా..' అంటూ సాగే ఈ పాటను కృష్ణకాంత్ రాయగా, శేఖర్‌చంద్ర స్వరపరిచారు. కపిల్ కపిలన్ ఆలపించారు. హీరోహీరోయిన్ల ప్రేమను ప్రజెంట్ చేస్తూ ఈ పాట సాగడం విశేషం. సింగీతం శ్రీనివాస్, అభిరామి, అమ్ము అభిరామి, లీలా శాంసన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేశ్ బానెల్లా, సమర్పణ: మారుతీ టీమ్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.